ఆనందమాని పింఛన్

- చురుగ్గా పెన్షన్ కానుక పంపిణీ
- జోన్-5లో 90 శాతం పూర్తి
- లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

కంచరపాలెం: ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్ సొమ్ము చేతికందడంతో లబ్ధిదారుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పెన్షన్ కానుకగా రూ.3 వేలు అందుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-5 పరిధిలోని నియోజకవర్గాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. జోన్‌లోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో శుక్రవారం వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు, ఇతరత్రా పెన్షన్లను పంపిణీ చేసినట్లు జోన్-5 కమిషనర్ ఆర్.జీ.వి.కృష్ణ తెలిపారు. వలంటీర్లు వేకువజామున మంచుకురిసే వేళలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

వేకువజామునే ఇళ్లకు వెళ్లి..

జీవీఎంసీ జోన్-5 పరిధిలో సుమారు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. సచివాలయ కార్యదర్శుల సమక్షంలో లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు అందించారు. ఆయా వార్డుల్లో వలంటీర్లు, వెల్ఫేర్ కార్యదర్శులు వేకువజాము నుంచి పెన్షన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. ఇళ్ల వద్దకే కాకుండా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పింఛన్ దారులు చికిత్స పొందుతున్న ఆస్పత్రులకు వెళ్లి వారికి పింఛన్ నగదును అందించారు.

శనివారం నాటికి 100 శాతం పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్-5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు.



జోన్-5 కంచరపాలెంలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్, సచివాలయ కన్వీనర్



విమ్స్‌లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్, కన్వీనర్

మర్యాదపూర్వక కలయిక

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో)గా బాధ్యతలు చేపట్టిన పి.మురళీధర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరించారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా కాలేజీలో ప్రిన్సిపాళ్లను అప్రమత్తం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మురళీధర్

జీవీఎంసీ జోన్-4 కమిషనర్‌గా సన్యాసినాయుడు



జగదాంబ: జీవీఎంసీ జోన్-4 కమిషనర్‌గా బి.సన్యాసినాయుడు నియమితుడయ్యారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయానికి కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ జోనల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తానన్నారు. సచివాలయ సెక్రటరీలతో కలిసి ప్రభుత్వ పథకాల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తానని జెడ్సీ తెలిపారు.

స్పెషల్ బ్రాంచ్ పొలిటికల్ సీఐగా వానపల్లి రామారావు

అల్లిపురం : స్పెషల్ బ్రాంచ్ పొలిటికల్ సీఐగా వానపల్లి రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఆయన హుకుంపేట, ఎస్.రాయవరం, గాజువాక, టూటౌన్ పోలీస్ స్టేషన్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. పోలీస్ శాఖలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు విధుల నిర్వహణలో చిత్తశుద్ధి కనబరిచి పలుమార్లు ఉత్తమ అధికారిగా అవార్డులు అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయనకు సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.



రామారావుకు అభినందనలు తెలుపుతున్న సహచర ఉద్యోగి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో రూ.1,000 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు. ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బొత్స ఝాన్సీని కలిసిన నాయకులు



బొత్స ఝాన్సీకి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం పార్లమెంట్ కో ఆర్డినేటర్ బొత్స ఝాన్సీని నియోజకవర్గంలో పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని వారు ఆమెకు హామీనిచ్చారు. ఝాన్సీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు మూలే రామారెడ్డి, బోదిలపాటి ఉమామహేశ్వరరావు, కొల్లి సింహాచలం, కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, అలుపన కనకరెడ్డి, పచ్చిరిపల్లి రాము, కొండబాబు, సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యులకు అభినందనలు



మారేష్, గురువాచారిలను అభినందిస్తున్న కొటాన రాము, రామన్నపాత్రుడు

డాబాగార్డెన్స్: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులుగా నియమితులైన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్, కె.గురువాచారిని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొటాన రాము, సంఘ ఉపాధ్యక్షుడు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కంట్రెడ్డి రామన్నపాత్రుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: నియోజకవర్గంలోని 39వ వార్డు వాడవీధిలో ముస్లిం మైనార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల కోసం కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అధిక శాతం ముస్లింలు కోటవీధి పరిసరాల్లోనే ఉన్నారని, వారి కోసం ఈ కార్యాలయం ప్రారంభించామన్నారు. కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కేపీ బాబా, స్టేట్ డైరెక్టర్ సబీరా బేగం, 39వ వార్డు కార్యకర్తలు కమల్, సత్య, బుజ్జి, రమణ, దూడ తాతారావు, రవి, ఇబ్రహీం, బాబ్జి, సిరాజు పాల్గొన్నారు.

తల్లిని నడిరోడ్డుపై వదిలేశారు..!

- ఆశ్రయం కల్పించిన ఏయూటీడీ వసతి గృహం

అల్లిపురం: తల్లిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు నడిరోడ్డుపై వదిలేశారు. వృద్ధాప్యంలో ఉన్న ఆమె నెల రోజులుగా రోడ్డుపై అవస్థలు పడుతోంది. ఇది గమనించిన కొంత మంది స్థానికులు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెకు సపర్యలు చేసి వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం పాలకొండకు చెందిన సరోజిని.. వారి బంధువులు నెల రోజుల క్రితం పూర్ణా మార్కెట్ సమీపంలోని దుర్గాలమ్మ గుడి వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి చలిలోను, ఎండలోను కాలం గడుపుతోంది. ఆమెను గమనించిన సారిపల్లి మహేష్ ఇచ్చిన సమాచారం మేరకు జక్కన్న వెంకట్రావు, హోంగార్డు ఉదయశంకర్ సహకారంతో ఆమెకు సపర్యలు చేసి నిరాశ్రయ వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించామని వాసు తెలిపారు.



టీఎస్ఆర్ కాంప్లెక్స్ ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న సరోజిని

38 మందికి కళ్లద్దాల అందజేత



లబ్ధిదారుకు కళ్లద్దాలు అందజేస్తున్న పాల శ్రీహరిరెడ్డి తదితరులు

అల్లిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 33వ వార్డు కుమ్మర వీధి సచివాలయం పరిధిలోని 38 మంది లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, యల్లంకి చిన్నమ్ములు, ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్ పార్వతి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు వై.ఝాన్సీ, పి.హేమలత, సంతోష్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

అల్లిపురం: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై టూ టౌన్ పోలీసులు కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 34వ వార్డు లక్ష్మీదేవిపేటకు చెందిన బెవర వాసు అలియాస్ శేఖర్ గత నెల 30వ తేదీన అదే ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో కనుగొన్నారు. వారిని తీసుకువచ్చి బాలికను వారి కుటుంబ సభ్యులకు అప్పగించి, యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రిమాండ్‌కు ఇద్దరు..

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 17వ తేదీ రాత్రి వెలంపేట, సాలిపేటకు చెందిన సుంకరి సతీష్, పడాల నాగసాయిలు ఎల్లమ్మతోటకు చెందిన తరుణ్‌సాయిని కిడ్నాప్ చేశారు. తరుణ్‌సాయి కోసం తల్లిదండ్రులు వెదికినా ఆచూకీ లేకపోవటంతో మహారాణిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ పి.అప్పలనాయుడు తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను జిల్లా పరిషత్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తరుణ్ సాయిని విడిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు



గెడ్డాపు అరుణ్‌కుమార్

అల్లిపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన తండ్రి తిరిగి రాలేదని మహారాణిపేటకు చెందిన గెడ్డాపు బాలకృష్ణ మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గత నెల 24న జగదాంబ దరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దకు గెడ్డాపు అరుణ్‌కుమార్ అనే వ్యక్తి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అప్పటి నుంచి పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. అతడి వయసు 54 ఏళ్లు. నలుపు రంగు శరీర ఛాయ, 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు కలిగి, నీలం రంగు షర్ట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 94407 96010, 99485 84665 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

4న బ్రాహ్మణుల ఐక్య సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణుల ఐక్య సదస్సు నిర్వాహకులు

డాబాగార్డెన్స్: విప్రోత్సవం-2024 పేరిట ఈ నెల 4న గురజాడ కళాక్షేత్రంలో బ్రాహ్మణుల ఐక్య సదస్సు నిర్వహించనున్నట్టు ఆహ్వాన సంఘం కన్వీనర్ పీవీ నారాయణరావు, కార్మిక సంఘం నాయకుడు వీవీ వామనరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఐక్యవేదిక సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటలకు నగర పరిధిలో గల బ్రాహ్మణ నేతల విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద గల మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పించి, గురజాడ కళాక్షేత్రం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. గతంలో ఇటువంటి సదస్సు 1991లో నిర్వహించినట్టు గుర్తు చేశారు. బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక రంగాల్లో గల పరిస్థితులపై చర్చించనున్నట్టు వెల్లడించారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 2 లక్షల వరకు బ్రాహ్మణ ఓట్లు ఉన్నాయన్నారు. ప్రధాన పార్టీలు బ్రాహ్మణ నేతలకు టికెట్లు ఇవ్వాలన్నారు. ఎంవీ భద్రం, భాట్టం శ్రీరామ్మూర్తి, డీవీ సుబ్బారావు వంటి బ్రాహ్మణ నేతలు సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నండూరి సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి, ఆకెళ్ల రమణమూర్తి, కావూరి చరణ్‌కుమార్, బి.శంకర్ నీలు, వి హనుమంతరావు పాల్గొన్నారు.

18 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన

సీతంపేట: సాయిదుర్గ హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో రామటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఇటీవల ప్రారంభమైన చేనేత వస్త్రాల ప్రదర్శన ఈ నెల 18 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు కె.హరీష్, సలోమి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, జైపూర్, న్యూఢిల్లీ రాష్ట్రాల కళాకారులు రూపొందించిన వివిధ కళాత్మక వస్తువులు, వస్త్రాలను ప్రదర్శించడంతోపాటు విక్రయిస్తామన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్యే పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి సర్వీస్ రూల్స్ లేకుండా పనిచేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ విడుదల చేసి, పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కాటాన శ్రీనివాస్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తగా మున్సిపల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని, జీవో నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. మున్సిపల్, కార్పొరేషన్లకు ఎంఈవో, డీవైఈవో పోస్టులను మంజూరు చేసి, వాటిని మున్సిపల్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వెంకటపతిరాజు, తమరాన త్రినాథ్, ఆర్.శ్రీనివాసరావు, రామకృష్ణారావు, ధర్మారావు, జగన్‌మోహన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

16వ రోజుకు దీక్షలు

సీతమ్మధార: ఆర్టీసీ విశాఖ డీపీటీవో వైఖరిపై చర్యలు తీసుకోవాలని జోనల్ కార్యదర్శి ఎంవీఆర్.మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ, పీటీడీ నేషనల్ మాజ్దూర్ యూనిట్ అసోసియేషన్ విశాఖ జిల్లా, విశాఖ రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేస్తున్న దీక్షలు శుక్రవారానికి 16వ రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌలభ్యాలు అందేలా చూడాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.నీలకంఠం, కేవీబీఎస్ఎం. కృష్ణ, జి.రాధకృష్ణ, పి.జి.పతి, ఎంఈ రావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం దీక్ష చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిట్ నాయకులు

ప్రభుత్వరంగాన్ని రక్షిద్దాం

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,037వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సెక్రటరీ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడటం అవివేకమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని, లేకుంటే పతనం తప్పదని హెచ్చరించారు. వై.రాజు, ఎం.సుబ్బారావు, వై.రాజు, కె.వి.పి.చంద్రమౌళి, కె.సంతోష్‌కుమార్, కె.చంద్రశేఖర్, ఎస్.ఎర్రిబాబు, వరలక్ష్మి పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే వాసుపల్లి జన్మదిన వేడుకలు

- నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని వార్డుల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 104 ఏరియాలోని వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం కళాశాలల అధ్యాపక సిబ్బంది ఎమ్మెల్యే వాసుపల్లిని గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వాసుపల్లిని పలు వార్డుల కార్పొరేటర్లు, పార్టీ మండల అధ్యక్షులు, వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నగర, జిల్లా, రాష్ట్ర నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయనకు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

◆ 29వ వార్డులోని జిల్లా పరిషత్ సమీపాన అమెరికన్ ఆస్పత్రి వృద్ధాశ్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పీతల వాసు కేక్ కట్‌చేసి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. 39వ వార్డు చికలపేటలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్, పార్టీ 36, 38, 39 వార్డుల మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం నేతృత్వంలో కేక్ కట్‌చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

◆ పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్ నేతృత్వంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని అన్నదానం చేశారు. వృద్ధులకు దుప్పట్లు అందించారు. 31వ వార్డు ప్రేమ సమాజంలో పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్దా శివాజీ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా అందిస్తున్న సేవలే మళ్లీ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తాయన్నారు. సేవా కార్యక్రమాల్లో పలు వార్డుల కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



నీలమ్మ వేపచెట్టు వద్ద చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, బొర్రా విజయలక్ష్మి తదితరులు



39వ వార్డులో కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

ఎమ్మెల్యేకు సత్కారం

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం వద్ద దేవస్థాన చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, బొర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేయించి ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.

◆ వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పచ్చిరిపల్లి రాము, మాదాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్టపై ఎమ్మెల్యే వాసుపల్లి చేత కేక్ కట్‌చేయించి మహిళలకు చీరలు అందించారు. కుమ్మర వీధిలోని పచ్చిరిపల్లి రాము కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. పేదలకు బియ్యం, చీరలు అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అశోక్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గత పదేళ్లుగా ఎమ్మెల్యే పర్సనల్ అసిస్టెంట్(పీఏ)గా పనిచేస్తున్న మొచ్చ సన్యాసిరావు, పలువురు కార్యాలయ సిబ్బంది రక్తదానం చేశారు.

◆ 39వ వార్డు వాడ వీధిలో వైఎస్సార్‌సీపీ సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే పీఏ సన్యాసిరావు, కార్యాలయ సిబ్బంది

పేద మహిళలకు చీరల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, పార్టీ వార్డు ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి, ఆయన చేత కేక్ కట్ చేయించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

అల్లిపురం: లయన్స్ క్లబ్ ద్వారకానగర్, మాక్సివిజన్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా శుక్రవారం బంగారుమెట్టలోని శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం వద్ద నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి రిఫర్ చేశారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది